# నీరుకొండ : మరో కారంచేడు

చీరాలలో దళితులు జులై 17న కారంచేడు ఘటన ద్వితీయ వార్షిక సభలు జరుపుకునేందుకు తయారౌతున్న సమయంలో నీరుకొండ భూస్వాములు దళితులపై దాడి జరపడం ద్వారా మరో కారంచేడును సృష్టించారు. కారంచేడు ఘటన నుండి స్ఫూర్తి పొందారనిపించే విధంగా సరిగ్గా అదే పద్ధతిలో పథకం ప్రకారం భూస్వాములు దాడిచేసి బరిసెలు గొడ్డళ్ళతో ఒక హరిజన వృద్ధుడిని హత్య చేశారు. ఎందరినో గాయపరిచారు. కారంచేడులో ముఖ్యమంత్రి బంధువర్గం దాడిలో ప్రధానపాత్ర వహించగా నీరుకొండలో మాజీ మంత్రి సోదరులు ప్రముఖంగా నాయకత్వం వహించారు.

## నేపథ్యం :

గుంటూరు జిల్లాలోని మంగళగిరికి 10 కి.మీ దూరంలో పడమటి దిక్కునవున్న ఐదువేల జనాభాగల గ్రామం నీరుకొండ. జనాభాలో 50 శాతంపైగా 200 కుటుంబాల కమ్మ కులస్తులు. భూమిలో 90 శాతం వారిదే. 40 శాతంగావున్న 160 కుటుంబాల హరిజనులు భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలు. మిగతా జనాభా యాదవ, కాపు, చాకలి వగైరా వెనుకబడిన కులస్తులు. ఎకరం 10 వేల రూపాయల నుండి 30 వేలదాకా విలువచేసే పొగాకు పండే మెట్ట పొలాలు ప్రధానంగా ఐదుగురు కమ్మ భూస్వాముల ఆధిపత్యంలో వున్నాయి. గ్రామంలో 200 దాకా పొగాకు బారన్లు వున్నాయి.

వ్యవసాయ సంబంధాలు అంతగా అభివృద్ధి చెందని నీరుకొండలో హరిజనులు పొలాల్లో కూలికి వెళ్ళడం, బారన్లకు

ముతాలుగా వెళ్ళి పొగాకు గ్రేడింగ్‌లో పాల్గొనడం ద్వారా పొట్ట పోసుకొంటారు. పొగాకు గ్రేడింగ్‌కు కూలి 7 రూ॥ నుంచి 8 రూ॥ లైతే, కలుపు తీయడంలాంటి వ్యవసాయ పనులకు ఇచ్చే కూలి కేవలం ఐదు లేదా ఆరు రూపాయలు మాత్రమే. (కనీస వేతన చట్టం ప్రకారం ఈ జోన్‌లో 13.20 ఇవ్వాల్సి ఉంటుంది) కూలి డబ్బులు కూడా పనులు చేసిన ఎన్నో నెలలకు గానీ ఇవ్వరు. పొగాకు గ్రేడింగ్ చేసింతర్వాత ఆ పొగాకును అమ్మి డబ్బు చేతికొచ్చిన తర్వాతే ఇష్టామవి నెలల తరబడి తిప్పుకుంటారు. ఇదే పద్ధతి ఇతర వ్యవసాయ పనులకు కూడా పాకింది. పని చేసిన రోజునుండి డబ్బు చేతికొచ్చేసరికి ఆరు నెలలయినా గడుస్తుంది. మాదాసు కృష్ణారావు అనే భూస్వామి లలిత, నాగేంద్రం అనే ఇద్దరు హరిజన కూలీలకు కలుపు తీసినందు కివ్వాల్సిన డబ్బులు సంవత్సరం అయినా ఇప్పటికీ ఇవ్వలేదట. పైగా కూలి బకాయిలు అడగడానికి వెళ్తే కసురుకోవడం, గెంటే యడం సర్వసాధారణం. కూలి సకాలంలో అందదు కాబట్టి ఐదు రూపాయలకు పైగా వడ్డీ చెల్లించి అదే ఊళ్ళో ఉన్న భూస్వాముల దగ్గరే హరిజనులు అప్పు చేస్తారు. అలాంటి అప్పులు ఒక్కో కుటుంబానికి వెయ్యి నుండి రెండు వేల రూ॥ల దాకా ఉన్నాయి. (భూస్వాములు తమ దగ్గర పనిచేసిన కూలీలకు మాత్రం డబ్బు లివ్వరు. వేరే ఇళ్ళదగ్గర పనిచేసిన వారికి అప్పులైతే యిస్తారు) ఇలా కూలి డబ్బులు లేటుగా యివ్వడంవల్ల ఒక్కోసారి కూలీలు తమ గ్రామంలో ముమ్మరంగా పనివున్నా పక్కవూరు పరిమికి వెళ్ళి కూలిచేసి డబ్బు తెచ్చుకుంటారు. ఇది నీరుకొండ భూస్వాము లకు కోపం తెప్పిస్తుంది.

ఈ ఆర్థిక వ్యత్యాసాలు సాంఘిక అసమానతలకు తోడ య్యాయి. హరిజనులను అంటరాని వాళ్ళుగా చూడటం, వారి పెళ్ళి వూరేగింపులను అగ్రవర్ణాల వారి వీధులగుండా వడవనివ్వక పోవడం లాంటి రూపంలో సాంఘిక అణచివేత ఈ గ్రామంలో వుంది. "సివిల్ రైట్స్ చట్టం ప్రకారం ఇది నేరం కదా. ఏమైనా పోలీసుకేసు పెట్టారా ?" అని సంఘటన జరిగిన రెండవరోజున ఆ గ్రామంలో తిష్టవేసిన హరిజన మంత్రి పుష్పరాజ్‌ను ఎ.పి.సి. ఎల్.సి. ప్రశ్నిస్తే ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని ఎవరూ తేలేదని సమాధానమిచ్చాడు. చట్ట ప్రకారం కాగ్నిజిబుల్ నేరం అయిన అంటరానితనం మూడేళ్ళపాటు ఆ గ్రామానికి చెందిన వ్యక్తి మంత్రిగావున్నా ప్రభుత్వం దృష్టికి రాలేదట ! ఇప్పటికైనా వచ్చిందో లేదో!

ఈ ఆర్థిక సాంఘిక వ్యత్యాసాలు ఘర్షణలకు దారితీసి ఎన్ని కల పార్టీల రూపంలో వ్యక్తమై గత ఆరు సంవత్సరాలుగా హరి జనులపై అనేక దాడులకు కారణమయ్యాయి. 1981 లో జరిగిన పంచాయితీ ఎన్నికల సందర్భంలో హరిజన యువకుడు సర్పంచ్‌గా పోటీ చేయడం భూస్వాములకు తీవ్రమైన ఆగ్రహం తెప్పించింది. అప్పుడు జరిగిన దాడులకు సంబంధించి భూస్వాములపై హరిజ నులు, హరిజనులపై భూస్వాములు పెట్టిన దాదాపు 14 కేసుల్లో అనేకం మంగళగిరి కోర్టులో ఇప్పటికీ నడుస్తున్నాయి. ఆనాడు పక్కవూరి సర్పంచ్ జోక్యం చేసుకుని అగ్రవర్ణాల వారి వీధికి వూరేగింపులు తీయకుండా వుండేటట్టు హరిజనులను ఒప్పించడంతో అప్పటికి తాత్కాలికంగా తగువులు వాయిదా పడ్డాయి. 1984 లో తెలుగుదేశం అధికారంలోకి రావడం ఆ గ్రామానికి చెందిన భూ స్వామే మంత్రి కావడంతో దాడులు తీవ్రరూపం ధరించి జూలై 15 ఘటనతో పరాకాష్టనందుకున్నాయి.

1983లో తొలిసారి తెలుగుదేశం అసెంబ్లీకి పోటీ చేసి నప్పుడు అనేకమంది హరిజనులు ఆ పార్టీకి ఓట్లేశారు. కానీ నూటికి నూరు శాతం హరిజనుల ఓట్లు పడలేదని భూస్వాములు వేధించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మండల ఎన్నికలప్పుడు హరిజనులు యాదవులలో ఒక సెక్షన్‌తో కలిసి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు. కానీ గ్రామంలో ఒకే ఒక పోలింగ్ బూతు వుండటం, అదీ భూస్వాముల ఇళ్ళ మధ్య వుండటం, మరో బూతు కావాలని హరిజనులు అడగడం, దాన్ని శాంక్షన్ కానీయకుండా తెలుగుదేశం వారు అడ్డుపడటం, హరిజనులను బూత్ వద్దకు రానీయకుండా తామే వారి ఓట్లన్నీ వేయడం, దాన్ని హరిజనుల వ్యతిరేకించడంతో భూస్వాములకు, హరిజనులకు మధ్య అగాధం పెరిగిపోయింది. ఆ సందర్భంగా హరిజనులపై దాడులు కూడా పెరిగాయి.

జూలై ఘటన :

జూన్ 24న ఒక హరిజన యువకుడి పెళ్ళి సందర్భంగా అతడిని గుర్రం ఎక్కించి హరిజనులు వూరేగింపు జరిపారు. తమతో స్నేహంగా వుంటున్న యాదవులు కొందరు ఆహ్వా నించగా ఆ యాదవుల బజారుగుండా వూరేగింపు నడిచింది. దాంతో ఆగ్రహం పట్టలేకపోయిన భూస్వాములు హరిజనులపై దాడి చేశారు. జూన్ 26 రాత్రి మంగళగిరి నుండి వాయిదాకి వెళ్ళి వస్తున్న హరిజనులపై ట్రాక్టరులో వెళ్ళి ఆయుధాలతో దాడి చేశారు. (అప్పటికే వూళ్ళో పోలీసు క్యాంపులోవున్న పోలీసులు ఏంచేస్తున్నారో అర్థంకాదు.) పెళ్ళి వూరేగింపు విషయంలో హరిజ నుల సైడ్ తీసుకున్నందుకు తాడిబోయిన శిఖారావు అనే యువ కుడిని కొట్టి గాయపరిచి చేతులు వెనక్కి విరిచి కట్టి కాంపులో వున్న పోలీసులకు అప్పజెప్పి 'పాములు కాలబెట్టబోతుంటే పట్టు కున్నామని' చెప్పారు. పోలీసులుకూడా తామేం తక్కువ తిన్నామా అని అతన్ని మళ్ళీ తన్ని రెండువందల రూపాయలు లంచం యిచ్చిన తర్వాత మంగళగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళి వదిలే శారు. అతను నీరుకొండ హరిజనుడని తెలిసి చికిత్స చేయడానికి డాక్టర్ నిరాకరించాడు.

ఇలాంటి ఉద్రిక్త వాతావరణం నెలకొని వున్నప్పుడు పోలీసులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటే జూలై 15 ఘటన జరిగివుండేది కాదు. జూలై 12 ఆదివారం నాడు హరిజనులు ఎప్పటిలాగే చర్చికి వెళ్ళి మామూలుగా ఇచ్చినట్టే కొబ్బరికాయలు చర్చికి సమర్పించుకున్నారు. అంతకు ముందురోజు ఎం.ఎస్.ఎస్. కోటేశ్వరరావు, మంత్రివర్గం నుండి తొలగించబడటంతో దానికి సంతోషంతో హరిజనులు ఫంక్షన్ చేసుకుంటున్నారని అగ్రవర్ణ భూస్వాములు వూళ్లో పుకారు లేవదీసి తమ జనాన్ని రెచ్చగొట్టారు. జూలై 15 పొద్దున్నే భూస్వాములు, కొందరు యాదవులు కలిసి 200 మందికి పైగా ముందుగా అనుకున్న పథకం ప్రకారం కత్తులు, గొడ్డళ్ళు, బరిసెలతో హరిజన వాడపై, హరిజనులకు మద్దతు ఇస్తున్న యాదవుల ఇళ్ళపై మూకుమ్మడిగా దాడిచేసి బీభ

త్సం సృష్టించారు. హఠాత్తుగా జరిగిన దాడి చూసి హరిజనులు భీతావహంగా పారిపోయారు. మన్నె శేషయ్య దాడి కొస్తున్న గుంపును చూసి పరిగెత్తి ఒక ఇంట్లో దాక్కున్నాడు. అప్పటికే అక్కడ మరో ఇద్దరు దాక్కొని వున్నారు. అది గమనించి రెచ్చిపోయిన మూక ఇంటి కప్పు పైకెక్కి శ్లాబ్‌ను పగల గొట్టేందుకు ప్రయత్నించింది. సిమెంటు వెంటిలేటర్లను బరిశెంతో విరగ్గొట్టి, ఆ కంతలోనుంచి పెద్ద పెద్ద రాళ్ళను లోపలికి విసిరేశారు. చివరికి ఇంటి తలుపులు గడి తీసి లోపలికి ప్రవేశించారు. లోపలున్న ముగ్గురిలో ఇద్దరు చురుగ్గా మరో వాకిటి నుండి తప్పుకోగా 70 సం॥ల ముసలి మన్నె శేషయ్యపైన బడి బరిసెలతో పొడిచి, గొడ్డళ్ళతో గాయపరిచి హత్య చేశారు. మరో ఇంట్లో దాక్కున్న బెజ్జం జీవరత్నంను 20 మంది చుట్టుముట్టి తలమీద, చెయ్యిపైనా గొడ్డళ్ళతో తీవ్రంగా గాయపరిచారు. కాళ్ళమీద కర్రలతో తీవ్రంగా మోదారు. దాడి విషయం పసిగట్టక పొలాల్లో ఎప్పటిలాగే పనిచేసుకుంటున్న పేద హరిజనులపై కూడా దాడి జరిగింది. శిఖా నాగేశ్వరరావు వూరికి అరమైలు దూరంలో పొలంలో వుండగా పది మంది దాడిచేసి తలమీద నడుముల మీద బలంగా గాయపరిచారు. వీరాస్వామిని బరిసెలతో కాళ్ళపై పొడిచి చేతులు కర్రలతో వెనక్కి విరిచేందుకు ప్రయత్నించారు. కొర్ర రోశయ్య అనే యాదవ యువకుడివి కాళ్ళపై బరిసెలతో పొడిచి గొడ్డళ్ళు తిరగేసి మోదారు.

**ఘటన తర్వాత :**

జూలై 15 **ఘటన జరిగిన** కొద్ది సేపట్లోనే సినిమా ఫక్కీలో మంగళగిరి ఎస్. ఐ. వచ్చి గాయాలు తగిలిన వారిని మంగళగిరి ఆస్పత్రిలో చేర్పించాడు. ఊళ్ళో కాంపులో వున్న పోలీసులైతే ఆయనకు దాడి విషయం చెప్పలేదట. మరెవరు చెప్పారని ప్రశ్నిస్తే ఎవరో అజ్ఞాత వ్యక్తి ఫోన్‌చేసి చెప్పారని అంటాడు. దాడిచేసిన వారికి తప్ప మరెవరికీ ఫోన్ లేని వూళ్ళో ఎవరు చెప్పినట్లు ? అంత త్వరగా మంగళగిరినుండి పోలీసులు ఎలా రాగలిగారు ? వాళ్ళకు ముందే దాడి గురించి తెలుసా ? తెలియకపోతే కాంపులో వున్న పోలీసులేంచేస్తున్నట్టు ?

పేదవాళ్ళు నేరం చేశారని తెలిస్తే వెంటనే గూడేలకు గూడేలను తగలబెట్టి, ఇళ్ళు కూలగొట్టి నానా భీభత్సం సృష్టించి ముద్దాయి తల్లి దండ్రులను బంధువులను నిర్బంధించి నానా హింసలు పెట్టే పోలీసులు నీరుకొండలో మాత్రం కనీసం చట్ట ప్రకారం నిందితులను పట్టుకునే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. పైగా సంఘటనతో సంబంధంలేని ఒక యాదవ వృద్ధుడిని, చాకలి కులస్తుడిని పట్టుకొని ఘనకార్యం చేశామని ప్రకటించారు. అంతేగాకుండా నీరుకొండకు వెళ్ళే బస్సులను రద్దుచేయించి, మంగళగిరి వద్దనే నీరుకొండ వెళ్ళే వాహనాలను అటకాయించేందుకు ప్రయత్నిస్తూ బాహ్య ప్రపంచంతో ఆ ఊరికి సంబంధాలు లేకుండా చేయాలని విఫలయత్నం చేశారు.

ఎన్. టి. ఆర్ సంఘటన జరిగిన రెండవ రోజే నీరుకొండ వెళ్ళి మొసలికన్నీరు కార్చి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వచ్చాడు. (అదీ మన్నె శేషయ్య కుటుంబానికి, 4 గురు గాయపడిన వారికే - కానీ పత్రికలు 43 మంది గాయపడ్డారని రాశాయి) నేరస్తులను వెంటనే పట్టుకుని క్రిమినల్ కేసు గట్టిగా నడపరా బాబూ అంటే న్యాయ విచారణ జరిపిస్తానంటాడు. పోలీసు పని అయిన నేర పరిశోధనని న్యాయమూర్తులకు అప్పగిస్తానంటాడు. ఈ దేశంలో ఏ ఒక్క న్యాయ విచారణా కమీషన్ కూడా ఏ దోషినీ శిక్షించలేక పోయింది. ఈ కమీషన్ కూడా అదే పని చేస్తుందని చెప్పాలి. ఇక ఇప్పటికే రిజిష్టరయిన క్రిమినల్ కేసును ఎంత పకడ్బందీగా నీరుగార్చగలరో వేచి చూడాలి.

**తాజా వార్త :**

జులై 19 : ముఖ్యమంత్రితో కలిసి నీరుకొండను దర్శించేందుకు వెళ్ళని హోం మంత్రి నేడు అసాధారణ పోలీసు బందోబస్తుమధ్య నీరుకొండను దర్శించారు. పోలీసులు వలవేసి గాలించి పట్టుకోలేకపోయిన ముద్దాయిల్లో 14 మంది నాటకీయంగా వచ్చి వలలో తామే చిక్కుకున్నారు.